క్లుప్తంగా

ఉపాధిహామీ పనులు కల్పించాలి



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

చింతకాని: పనులు లేక సుదూర ప్రాంతాలకు వెళ్తున్న కూలీలకు వెంటనే ఉపాధిహామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా రోజువారి కూలీ రూ.800 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వత్సవాయి జానికి రాములు, కోటేశ్వరరావు, సత్యం, కిరణ్, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



మృతుని భార్య లక్ష్మికి బీమా చెక్కు అందిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ వేణుబాబు

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల పంచాయతీలోని మద్దేల రాంబాబు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. జీవన్‌జ్యోతి బీమా కలిగి ఉండటంతో సత్తుపల్లి ఎస్‌బీఐ మేనేజర్ వేణుబాబు చేతుల మీదుగా క్లయిమ్ చేసిన రూ.2 లక్షల బీమా చెక్కును ఆయన భార్య మిద్దేల లక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ వేణుబాబు మాట్లాడారు. ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఏదో ఒక ఇన్సూరెన్స్ చేయించుకుంటే కుటుంబ సభ్యులకు రక్షణగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మిత్ర జక్కుల కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి



కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ థాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసిన మంజుల

కారేపల్లి: కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకే ఆనాడు యూపీఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని కాంగ్రెస్ పార్టీ మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్యారావ్‌థాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితారావులను పగడాల మంజుల కలిశారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వారికి విన్నవించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

వైరా: యువకులు క్రీడలతో పాటు సామాజిక సేవలో కూడా పాలు పంచుకోవాలని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అన్నారు. వైరా మాజీ సర్పంచ్ బొర్రా వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వైరాలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ పోటీలలో వైరా మండలం ముసలిమడుగు జట్టు ప్రథమ స్థానాన్ని సాధించగా జానీ సీసీ జట్టు ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ విజేతలకు బహుమతులు అందింజేసిన అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దార్న రాజశేఖర్, మిట్టపల్లి నాగి, మరికంటి శివ, పణితి సైదులు, టోర్నమెంట్ నిర్వాహకులు అంజాద్ పాషా, కొమరనేని కిరణ్, రేమళ్ల సురేష్ పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేత

ఎర్రుపాలెం: ఈ నెల 23 నుంచి 25 వరకు ఎర్రుపాలెం రైల్వేగేటు మూసివేయనున్నారు. మూడవ లైన్ పనులు నిమిత్తం ఈ గేటును మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కావున వాహనదారులు, మండలవాసులు సహకరించాలని కోరారు.

నేడు సామూహిక కుంకుమ పూజలు

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని శ్రీగీతామందిరంలో శ్రీవాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం 6 గంటలకు సామూహిక కుంకుమపూజలు నిర్వహించబడతాయని వాసవీక్లబ్ అధ్యక్షులు పోకూరి కృష్ణప్రసాద్, గుడిమెట్ల ప్రసాద్, వనమా నరేష్, ఏపూరి పురుషోత్తమరావులు తెలిపారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం

- తేలుతున్న కంకర.. గోతులమయంగా రహదారులు
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్
- పట్టించుకోని అధికారులు



దమ్ము చక్రాలతో బీటీ రొడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్ (ఇన్‌సెట్) కోతకు గురైన బీటీ రోడ్డు

కల్లూరు రూరల్: దమ్ము చక్రాల తాకిడికి కోట్లు ఖర్చుచేసి అభివృద్ధి పరిచిన రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. వేసిన రహదారులు మూన్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. కల్లూరు మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు అను సంధానంగా నిర్మించిన బీటీ రోడ్లు వ్యవసాయానికి సంబందించి, దుక్కి దున్నేందుకు ట్రాక్టర్లకు ఫుల్‌వీల్స్ అమర్చి వరిమడుల్లో దమ్ము చేస్తుంటారు. మండలంలోని అన్నిగ్రామాల ఆయకట్టుకు రహదారి సౌకర్యం ఉండటంతో, రోడ్డు పక్కనే పొలాలు ఉన్నాయి. దీంతో రైతులు దుక్కులు దున్నేందుకు తమ గ్రామాల నుంచి వరి పొలాలకు ఫుల్‌వీల్స్ వేసుకొని తిరగటంతో బీటీ రొడ్డులు కోతలకు గురౌతున్నాయి. కల్లూరు మండలంలో ఈ సంత్సర కాలంలో సుమారు 80కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్లపై ట్రాక్టర్ ఫుల్‌వీల్స్‌తో నడపడం వలన 10 సంవత్సరాలు ఉండాల్సిన రోడ్లు ఆరునెలలకే పాడైపోతున్నాయి.

కనుమరుగవుతున్న నాగళ్లు..

నాగళ్లతో దుక్కులు దున్నే విధానం క్రమంగా కనుమరుగవుతుంది. పశువులకు అరకకట్టి, నాగళ్లతో దుక్కులు దున్ని వ్యవసాయం చేసే రైతు కనిపించడంలేదు. రెడిమేడ్‌గా ట్రాక్టర్లతో వ్యవసాయం చేసే విధానం ఆచరణలోకి వచ్చింది. మండలంలోని లోకవరం, పుల్లయ్య బంజర, ఎర్రబోయినపల్లి, లింగాల, బత్తుల పల్లి, కప్పల బంధం, తెలగవరం, మర్లపాడు, వెన్నవెల్లి, చంద్రుపట్ల, ముచ్చవరం, ఓబులరావు బంజరు తదితర గ్రామాల్లో ఫుల్‌వీల్స్ ట్రాక్టర్లు తిరిగి రోడ్లను ధ్వంసం చేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

రహదారుల రక్షణ పట్టని ప్రజానీకం..

ప్రజారవాణ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయల ధనాన్ని వెచ్చిస్తుంటే, రోడ్ల పటిష్టత, రక్షణ గురించి ప్రజలు పట్టించుకోలేక పోవటం దారుణమన్నారు. కళ్లెదుటే ఫుల్ వీల్స్ ట్రాక్టర్లతో రోడ్డు ధ్వంసం చేస్తుంటే తమకు ఏమి పట్టనట్లు వ్యవహరించడం విచారకరం. రహదారులు ప్రజలు ఆస్తి, వాటని కాపాడుకోవడం అందరి బాధ్యత. ఒక గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టాలంటే అంతకు ముందు నిధుల విడుదలకు సంబంధించి ఎంతో కసరత్తు చేయాల్సి ఉంటుంది. ప్రజలు చెల్లించిన ధనంతో ప్రభుత్వం ప్రజా అవసరాల కోసం రహదారులను నిర్మిస్తుంది. అందుకే గ్రామలవారిగా రహదారుల రక్షణకు కమిటీలు వేసే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం..



బీటీ రోడ్లపై ఫుల్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్డుపై తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటాం. దుక్కులు దున్నే ట్రాక్టర్లు రోడ్డుపైకి వచ్చినపుడు ఫుల్‌వీల్స్‌కు పట్టాతొడుగు వేయాలి. లేని యెడల రహదారులు ధ్వంసం అవుతాయి. ఈ సారి ఎవరైన దమ్ము చక్రాలతో వెలితే ఊపేక్షించేది లేదు. – హనూక్, సీఐ

ఖేలో ఇండియా పోటీలకు జిల్లా వాసి



శ్రవంత్

కల్లూరు: ఖమ్మం జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుడు బి.శ్రవంత్ జూనియర్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఖేలో ఇండియా యూత్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈమేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్య కల్లూరులో ఆదివారం వివరాలు వెల్లడించారు. ఖేలో ఇండియా పోటీలు మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్పూర్‌లో ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు జరుగుతాయని, అందులో శ్రవంత్ పాల్గొంటాడని తెలిపారు. రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి నేటి కృష్ణమూర్తి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేయగా శ్రవంత్ తర్ఫీదు పొందుతున్నాడని, ప్రస్తుతం పాల్వంచ కిన్నెరసాని ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు చదువుతున్నాడని ఆయన వివరించారు.

కనీస అవసరాలు తీరడం లేదు



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: భారత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఆర్థిక వ్యత్యాసాలు పెరిగి 50శాతం మంది ప్రజలకు కనీస అవసరాలు తీరడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యుడు బండారి రమేష్ అన్నారు. ఆదివారం వైరా సీపీఎం కార్యాలయంలో బోడపట్ల రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన లెనిన్ 99వ వర్ధంతి సభలో వారు పాల్గొని ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం పెరిగి పోతుందన్నారు. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ శక్తుల చొరబాటును వ్యతిరేకించాలన్నారు. సరళీకృత విధానాల వలన సమాజంలో మార్పులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సమత, చలపతిరావు, మచ్చా మణి, రామారావు, వీరభద్రం, కృష్ణారావు, శ్రీనివాసరావు, జమాల్, ప్రకాశరావు, నరసయ్య, రామారావు, వెంకటేశ్వరరావు, సాంబశివరావు, నరసింహారావు, ఆదిలక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను సాధించాలి



మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హస్సేన్

పెనుబల్లి : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాధించాలని మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల హస్సేన్ అన్నారు. మండలంలోని వియంబంజర్ సప్తపది ఫంక్షన్‌హాల్‌లో మాల మహానాడు రాష్ట్ర స్థాయి సమావేశం ఆ సంఘం జాతీయ కార్యదర్శి మేకతొట్టి కాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హస్సేన్ పాల్గొని మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు ప్రభుత్వ శాఖలను ప్రైవేట్‌పరం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు సాదే డేవిడ్‌రాజు, ప్రధాన కార్యదర్శి పరంజ్యోతిరావు, నాయకులు కాంతయ్య, సత్యనారాయణ, రమేష్, వెంకటస్వామి, అనసూర్య, రత్నాకర్, హైకోర్టు న్యాయవాది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



మున్సిపల్ చైర్మన్ జైపాల్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న కేర్ ఆస్పత్రి వైద్యులు



వైరారూరల్: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వైరా: వైరాలో ఉచిత వైద్య శిబిరం హైదరాబాద్ మలక్‌పేట్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆదివారం వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ కార్డియాలజిస్టు వెంకటేష్ గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి సిబ్బంది నరేందర్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు శివ, రాజశేఖర్, నాగేశ్వరరావు, సురేష్, సర్వేశ్వరరావు, అర్జున్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాలడుగులో..

వైరారూరల్: మండలంలోని పాలడుగు గ్రామంలో ఆదివారం శరత్ మాక్స్ విజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని వైరా సొసైటీ డైరెక్టర్ వనమా చిన్న సత్యనారాయణ ప్రారంభించారు. పాలడుగు గ్రామస్తులకు సేవ చేయాలనే ఆలోచనతో శరత్ మాక్స్ విజన్ సౌజన్యంతో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. వైద్య శిబిరం కోఆర్డినేటర్ విక్రమ్ సింగ్, నితిన్ హరికృష్ణ, అనీల్, వనమా జానకి రామయ్య, షేక్.మజీద్, బాజోజు రమణ, రిహానా, శంకరయ్య పాల్గొన్నారు.

మండలంలో మాజీ ఎమ్మెల్యే పర్యటన



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

కారేపల్లి: వైరా మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ కారేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివారం కారేపల్లి రైల్వే స్టేషన్ బజార్‌లో ఇటీవల మృతి చెందిన సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. అదే విధంగా.. ఉసిరికాయపల్లి, పాతకమలాపురం గ్రామాల్లో పర్యటించి ఇటీవల అనారోగ్యాలతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి, వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జగన్ నాయక్, నాయకులు వీరేందర్, రమేష్, వసంత, వెంకటేశ్వర్లు, రవీందర్, గౌసుద్దీన్, రమేష్, సత్యనారాయణ, నాగమణి, సుజాత, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మన్మధరావు, నరేన్, శ్రీను, జుంకీలాల్, చందూ, నాగరాజు, రాజేష్, షరీఫ్ రంగా తదితరులు పాల్గొన్నారు.

భట్రాజు సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలిగా శైలజ



జనకనూరి శైలజ

సత్తుపల్లి: భట్రాజు సంఘం జిల్లా స్థాయి ఎన్నికల్లో సత్తుపల్లి పట్టణానికి చెందిన జనకనూరి శైలజ జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. జిల్లా సంఘం ఎన్నికలు ఆదివారం ఖమ్మం పట్టణంలో జరిగాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కూరపాటి రంజరాజు, పుల్లం రాజులతో పాటు సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో శైలజ కూడా ఉన్నారు. వీరికి భాస్కరిణీ వీరంరాజు, విలాసకవి వెంకటరాజు, కూరపాటి శ్రీనివాసరాజు, దేనువుకొండ శ్రీనివాసరాజు, వందన, బి.మధుసూదన్ రాజు, శ్రీకాంత్‌లు అభినందనలు తెలిపారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 'మీల్స్ ఆన్ వీల్స్' ప్రారంభం



అల్పాహారాన్ని అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్

వైరా: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు వైరా లయన్స్‌క్లబ్ 60 రోజుల పాటు చేపట్టే మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, లయన్స్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీ కృష్ణ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 60 రోజుల పాటు ఉచిత అల్పాహారాన్ని వివిధ సెంటర్లలో దాతల సాయంతో అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షుడు నాగేశ్వరరావు, వెంకటేష్, నాగేశ్వరరావు, మధు, ఉపేందర్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రమేష్, రాజారావు, బుచ్చిరామారావు, వెంకటనారాయణ, కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సత్తుపల్లి నియోజకవర్గం ముందంజ



తల్లాడలో కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

తల్లాడ: అభివృద్ధిలో సత్తుపల్లి నియోజకవర్గం జిల్లాలోని అగ్రగామిగా నిలుస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఆదివారం తల్లాడ రైతు వేదికలో తహసీల్దార్ గంటా శ్రీలత అధ్యక్షతన జరిగిన సభలో ఆయన పాల్గొని 51 మందికి కల్యాణలక్ష్మి, 38 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. రూ.70 లక్షల విలువైన చెక్కులతో పాటు చీరలు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణా ప్రభుత్వం సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే సీఎం కేసీఆర్ సత్తుపల్లి మున్సిపాలిటీకి రూ.30 కోట్లు, కల్లూరు, తల్లాడ మేజర్ పంచాయతీలకు రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నెల రోజుల్లోనే తల్లాడ మండలానికి రూ.57 కోట్లు నిధులు రోడ్ల అభివృద్ధికి మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ప్రమీల, వైరా ఏఎంసీ వైస్ చైర్మన్ భద్రరాజు, తల్లాడ సొసైటీ అధ్యక్షులు వీరమోహన్‌రెడ్డి, ఎస్సై సురేష్, ఆర్ఐలు రాధిక, శ్రీనివాస్, ఐలూరి లక్ష్మి, తూము శ్రీనివాసరావు, కిరణ్‌బాబు, కోసూరి నరసింహారావు, కృష్ణయ్య, రుద్రాక్ష బ్రహ్మం, పెరికె నాగేశ్వరరావు, వెంకటి, రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మురళి, దాసురావు, నాగులు, సుదర్శన్, వెంకటయ్య, వెంకటేశ్వరరావు, జీవీఆర్ పాల్గొన్నారు.

ఉర్దూ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సండ్ర..

కల్లూరు రూరల్: కల్లూరులో దాతల సాయంతో ఏర్పాటు చేసిన ఉర్దూ స్కూల్‌ను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం ప్రారంభించారు. స్థానిక వ్యాపారవేత్త ఎండీ అన్సార్‌అలీ సొంత నిధులు వ్యయంతో ఉర్దూ స్కూల్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కల్లూరులో 70లక్షలతో షాదీఖానా మంజూరు చేయటం జరిగిందన్నారు. సత్తుపల్లిలో కూడా 2కోట్లతో షాదీఖానా మంజూరైనట్లు వివరించారు. జమాతే ఇస్లాం రాష్ట్ర నాయకుడు ఇలియాజ్ మాట్లాడారు. కల్లూరు మండలాధ్యక్షుడు సయ్యద్ అలీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కల్లూరు సర్పంచ్ నీరజ, ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ సభ్యులు కట్టా అజయ్‌కుమార్, మండల జిల్లా రైతు సమితి నాయకులు లక్కినేని రఘు, చందర్‌రావు, జెడ్పీటీసీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, ఎంపీటీసీలు కిరన్‌కుమార్, లక్ష్మణ్‌రావు, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ ఇమాం, ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యుడు కమ్లి, ముస్లిం ప్రముఖులు ముజహిద్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులకు పూర్వవైభవం వస్తుంది



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

మధిర: ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టులకు పూర్వవైభవం వస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆదివారం సీపీఎం మధిర మండల, పట్టణ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పోతినేని సుదర్శన్ మాట్లాడారు. చైతన్యవంతమైన ఖమ్మం జిల్లా ప్రజలు మతోన్మాద రాజకీయాలను, ప్రజలను చీల్చే రాజకీయాలను సహించరని తెలిపారు. ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని, సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం శ్రేణులు ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మధిర మండల కార్యదర్శి మందా సైదులు, నాయకులు మురళి, రాధాకృష్ణ, ప్రభాకర్, శంకర్ రావు, నాయుడు శ్రీరాములు, బేగం పాల్గొన్నారు.

ఏసీడీలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఆనందరావు

బోనకల్: ప్రజలపై మోపుతున్న అడిషనల్ కన్జషన్ డిపాజిట్ చార్జీలను (ఏసీడీ)లను రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోడ్ డెవలప్‌మెంట్ పేరిట గత ఏడాది డబుల్, త్రిబుల్ బిల్లులు వసూలు చేశారన్నారు. ఈ ఏడాది ప్రతి నెల రూ.500 వచ్చే బిల్లులు రూ.1500 – 2000 వరకు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులు, నిరుపేదలు ఈ ఏసీడీ బిల్లులను చెల్లించలేరని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు నాగభూషణం, ఆకెన పవన్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ముదిగొండ: అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ముదిగొండ: మండలంలోని వల్లబి పాఠశాలలో 1975–76 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకుని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అదే పాఠశాలలో పదో తరగతిలో ఫస్ట్‌ర్యాంక్ సాధించిన బెల్లంకొండ స్పందనకు రూ.6,000 నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణకుమారి, పూర్వ విద్యార్థులు సంఘం ప్రతినిధులు ప్రసాద్, ప్రకాష్, బట్టార్, కోటేశ్వరరావు, తిరుమలరావు, వెంకటేశ్వర్లు, ధనమూర్తి, పుల్లయ్య, బ్రహ్మం పాల్గొన్నారు.

చిన్ననాటి జ్ఞాపకాలతో.. ఎంపీపీ

తల్లాడ: తన చిన్ననాటి స్నేహితులతో తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఖమ్మం చెరుకూరు గార్డెన్‌లో వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1986 – 88 సంవత్సరంలో ఇంటర్ మీడియట్ చదివిన బ్యాచ్‌తో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కాలేజీ జీవితాన్ని జ్ఞాపకం తెచ్చుకున్నారు.



అటెన్షన్ ప్లీజ్

కల్వర్టు ఉంది.. జాగ్రత్త



కొణిజర్ల మండలంలోని పల్లిపాడు లాలాపురం గ్రామాల మధ్య ఉన్న మూల మలుపు వద్ద కల్వర్టు కనిపించకుండా చెట్ల మధ్య ప్రమాదకరంగా ఉంది. ఖమ్మం కొత్తగూడెం మధ్య నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డుపై పోతుంటాయి. కల్వర్టు కనిపించక అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. - కొణిజర్ల

ప్రశ్నించాల్సిన అధికారి : ప్రవీణ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, కొణిజర్ల
సెల్ నంబర్ : 7660805013